## క్లుప్తంగా

### పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



తూము ఆశ్రితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు

పోడూరు: విద్యార్థులు చిన్ననాటి నుంచి పోటీతత్వాన్ని అలవర్చుకోవాలని గుమ్మలూరు మెయిన్ స్కూల్ హెచ్‌ఎం కొల్లాబత్తుల సూర్యకుమార్ అన్నారు. యూటీఎఫ్ మండలశాఖ ఇటీవల నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థిని స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో తృతీయ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలో హెచ్‌ఎం సూర్యకుమార్, ఉపాధ్యాయులు ఆశ్రితను అభినందించారు. ఉపాధ్యాయురాలు పీటర్సన్ శాంతాగ్రేస్, రావి హరీష్‌బాబు, రావిపాటి మాణిక్యం, పెనుగొండ భూలక్ష్మి, కంతేటి నాగమణి పాల్గొన్నారు.

### పేరుపాలెం సౌత్‌లో ఫ్యామిలీ ఫిజీషియన్

మొగల్తూరు: పేరుపాలెం సౌత్ 2 సచివాలయం పరిధిలో మంగళవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తూర్పుతాళ్ళు ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన డాక్టర్ పి రంజిత్ కుమార్ సుమారు 62 మంది రోగులను పరీక్షించారు. పీహెచ్‌సీకి వచ్చిన వారితో పాటు అంగన్వాడీ చిన్నారులను, లేవలేని స్థితిలోఉన్న రోగుల ఇంటికి వెళ్లి వైద్య పరీక్షలుచేసి మందులు అందజేశారు. సిబ్బంది మంగతాయారు, జి సాధామ ని, ప్రభాకర్,సతీష్ పాల్గొన్నారు.

### పింఛన్ల పంపిణీ



మొగల్తూరులో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ పడవల మేరీ

మొగల్తూరు: మండలంలోని 21 సచివాలయాల పరిధిలో సుమారు 79 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఆర్‌సీ ఆనంద్‌కుమార్ మంగళవారం తెలిపారు. మండలంలో వృద్ధాప్య, వితంతువు, దివ్యాంగుల తదితర పింఛన్ల లబ్ధిదారులు 10,514 మంది ఉండగా 8,382 మందికి పింఛన్లు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, పార్టీ నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

### ముమ్మరంగా ఉపాధి పనులు

మొగల్తూరు: మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. అమృత్ సరోవర్ పథకంలో ముత్యాలపల్లి, వారతిప్ప, మొగల్తూరు, రామన్నపాలెం, పేరుపాలెం నార్త్ గ్రామాల్లో చెరువులను అభివృద్ధి చేస్తుండగా మిగిలిన గ్రామాల్లో పంట కాలువలు, బోదెల్లో గుర్రపుడెక్కను తొలగిస్తున్నారు. జిన్నూరు కాలువ శివారు గ్రామాలైన కొత్తపాలెం, శేరేపాలెంకు ప్రవహించే కాలువలో భారీగా పెరిగిన గుర్రపుడెక్కను మంగళవారం తొలగించే పనులు చేపట్టామని ఏపీవో వై శ్రీనివాస్ తెలిపారు.

### ఏఎస్ఎన్ఎం కళాశాలలో 84.45 శాతం ఉత్తీర్ణత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం ఐదో సెమిస్టర్ ఫలితాల్లో 84.85 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి రాజరాజేశ్వరి తెలిపారు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో 238 మంది విద్యార్థులు పరీక్షల్లో పాల్గొనగా 201 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. విద్యార్థిని రావూరి కరుణకుమారి 92.3 శాతంతో కళాశాల మొదటి ర్యాంకు సాధించిందన్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ టి కృష్ణ, కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

### నేడు తెప్పోత్సవం

పెనుమంట్ర: పెనుమంట్రలో కనకదుర్గమ్మ వారి తీర్థ మహోత్సవం, సీతారాముల తెప్పోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ తమనంపూడి సాయి నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రెండు ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం 60 ఏళ్లుగా ఇక్కడి ఆనవాయితీ అని చెప్పారు. పెనుమంట్రలో బుధవారం నిర్వహించనున్న ఉత్సవాలకు ఏపీ శాప్ ఛైర్మన్, వైఎస్సార్ సీపీ యూత్ రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తేతలి సుధీర్ రెడ్డి తెలిపారు. బైరెడ్డితో పాటు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రుడా ఛైర్ పర్సన్ మేడపాటి షర్మిళా రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఎస్ ఇల్లింద్రపర్రులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీగా పెనుమంట్ర చేరుకొంటారు. అమ్మవారి దర్శనం అనంతరం బహిరంగ సభ నిర్వహించనున్నారు.

### జూదరుల అరెస్ట్

యలమంచిలి: ఏనుగువానిలంక శివారున కొబ్బరితోటల్లో పేకాడుతున్న ఐదుగురిని మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై జాజుల విజయ్ నాగప్రసాద్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.8,090 నగదు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు
- లక్ష్మణేశ్వరంలో ఆసరా చెక్కుల పంపిణీ



లక్ష్మణేశ్వరంలో ఆసరా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు తదితరులు

నరసాపురం రూరల్ : పేదరిక నిర్మూలనకు జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాల సంక్షేమ పథకాలు ఎంతగానో దోహదపడుతున్నాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరంలో మంగళవారం నిర్వహించిన వైఎస్సార్ ఆసరా మూడో విడత పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తొలుత లక్ష్మణేశ్వరం, యర్రంశెట్టివారిపాలెం, రుస్తుంబాద, రాజుగారితోట, సీతారాంపురంసౌత్, సీతారాంపురం నార్త్ గ్రామాలకు సంబంధించిన 144 స్వయం సహాయక సంఘాలకు సుమారు రూ.12కోట్ల విలువైన నమూనా చెక్కును అందించారు. గత ప్రభుత్వం రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి 2014లో అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన హామీ నెరవేర్చలేదన్నారు. మనందరి ప్రభుత్వం వచ్చిన తరువాత కరోనా సమయంలోనూ ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అమ్మ ఒడి, నాడు–నేడు, వైఎస్సార్ సంపూర్ణ ఆహార పథకం, వంటి పథకాలను అమలు చేశామని అన్నారు. మహిళా సోదరీమణులు అందించిన దీవెనను మరువకుండా అన్ని రకాలుగా వారికి అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలిచిందన్నారు. మహిళలందరూ ఆర్థికంగా నిలదొక్కుకునేలా వైఎస్సార్ ఆసరా పథకానికి సీఎం జగన్ శ్రీకారం చుట్టారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర సందర్భంగా రుణమాఫీకి హామీ ఇచ్చారని అందుకు అనుగుణంగా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వృద్ధి చెందాలనే లక్ష్యంతో మేమంతా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ప్రసాదరాజు పేర్కొన్నారు. డ్వాక్రా మహిళలకు కేవలం ఆసరా పథకమే కాకుండా సున్నా వడ్డీ, చేయూత, అమ్మ ఒడి, స్త్రీ నిధి రుణాలు, డాక్వా రుణ మొత్తం పెంచడం వంటి ఎన్నో పథకాలను అందించామని ఎమ్మెల్యే ప్రసాదరాజు పేర్కొన్నారు. నియోజకవర్గంలో చిరకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. రానున్న రోజుల్లోనూ మీరంతా మరింత మద్దతు ఇచ్చి మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేయడానికి అవకాశం కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలు క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, జడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, ఎంపీపీ మైలాబత్తుల సోనీ, వైస్ ఎంపీపీ ఉంగరాల రమేష్ నాయుడు, మాజీ ఆప్కాబ్ చైర్మన్ అంద్రాజు చల్లారావు, సర్పంచ్ తిరుమాని వెంకట్రాజు, దొంగ మురళీకృష్ణ, కంకటాల పెద్దిరాజు, కడలి రాంబాబు, మత్తే సువర్ణరాజు, దేశింశెట్టి సురేష్, ముద్దాల సురేష్, కడలి ఆదినారాయణ, కోలపర్తి రామకృష్ణ, వెన్నా మురళి, ఏపీయం పద్మ, పలువురు నాయకులు పాల్గొన్నారు.

### కొంతేరు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణం ప్రారంభం

యలమంచిలి: కొంతేరులోని జగనన్న కాలనీ లే అవుట్–3లో పలు ఇళ్లకు మంగళవారం లబ్ధిదారులు శంకుస్థాపన చేశారు. ఈ కాలనీలో 73 మందికి పట్టాలు ఇచ్చారు. కాలనీ లోపలకు వెళ్లడానికి పంట బోదె అడ్డుగా ఉంది.దీంతో ఇంత వరకు ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. ఇటీవలే ఓటీఎస్ నిధులతో బోదెకి కల్వర్టు నిర్మించడంతో లబ్ధిదారులలో సుమారు 50 మంది సొంతంగా ఇళ్ల నిర్మాణానికి ముందుకు వచ్చారు. కొంతమంది మూడో ఆప్షన్‌లో ఇల్లు నిర్మించాలని కోరడంతో అధికారుల పర్యవేక్షణలో శంకుస్థాపన చేయించారు. కాంట్రాక్టర్‌ను తీసుకువచ్చి ఇళ్ల నిర్మాణానికి ప్లానింగ్ వేయించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ కొంతేరు గ్రామ కమిటీ అధ్యక్షుడు కుక్కల రామకృష్ణ, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి, ఈఓపీఆర్డీ కాటూరి మాణిక్య వైభావతి, గ్రామ కార్యదర్శి కూనా వెంకట రామాంజనేయులు, వీఆర్వో గెద్దం చిన్న సత్యనారాయణ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఇప్పిలి దేవిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

# ‘మా నమ్మకం నువ్వే జగనన్న’ విజయవంతం చేయాలి



పాలకొల్లులో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ కవురు శ్రీనివాస్

పాలకొల్లు అర్బన్: ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్న మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమాన్ని సచివాలయ, గృహ సారథులు బాధ్యతగా పనిచేసి విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్ అన్నారు. పాలకొల్లు వైసీపీ కార్యాలయంలో మంగళవారం మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి సచివాలయ, గృహ సారథులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడారు. ప్రతి ఇంటికీ వెళ్లి కనీసం పది నిమిషాల పాటు లబ్ధిదారులతో మాట్లాడి వారి స్పందనను తెలుసుకోవాలన్నారు. వారి సూచనలు, సలహాలు తీసుకుని వారి అనుమతితో పోస్టర్‌ను వారి ఇంటి గుమ్మానికి అతికించి ఫొటో తీసుకుని కేంద్ర కార్యాలయానికి వాట్సాప్ ద్వారా పంపించాలన్నారు. అక్కడి నుంచే లబ్ధిదారుల ఫోన్ నుంచి మిస్డ్ కాల్ ఇవ్వాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వం పెంచిన డీజిల్, పెట్రోల్, నిత్యావసర, పామాయిల్ ధరలను సైతం రాష్ట్ర ప్రభుత్వానికి ఆపాదించి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చేస్తున్న అసత్య ప్రచారాన్ని తిప్పి కొట్టాలన్నారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనంద ప్రకాష్ మాట్లాడుతూ 2024లో 175 అసెంబ్లీ స్థానాలను గెలవబోతున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీలు గుంటూరు పెద్దిరాజు, నడపన గోవిందరాజుల నాయుడు, చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేటి సూర్యనారాయణ, సచివాలయ కన్వీనర్లు ఎంఎస్ వాసు, పార్శి వెంకటరత్నం, మండల పరిషత్ మాజీ ప్రతిపక్ష నేత చిట్టూరి ఏడుకొండలు, యలమంచిలి, పోడూరు సచివాలయ కన్వీనర్లు ఓదూరి భాస్కరరావు, బాబి. ఇనుకొండ రవి తదితరులు పాల్గొన్నారు.

**వెలివెలలో...**

వెలివెలలో గ్రామ సచివాలయ కన్వీనర్ల సమావేశం మండల సచివాలయ కన్వీనర్ పార్శి వెంకటరత్నం అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 20వ తేదీ వరకు 13 రోజుల పాటు గ్రామాల్లో నిర్వహించాల్సి మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంపై సచివాలయ, గృహ సారథులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కెల్లా సింహాచలం, ఉపసర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు, వైసీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గూడూరి నరసింహారావు, ఎంపీటీసీ గెద్దం కుటుంబరావు, పార్టీ నాయకులు మన్నె కోటేశ్వరరావు, ఏనుగుపల్లి చంద్రశేఖరరావు, విత్తనాల నరసింహారావు, పోతుమూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# 8న రన్ ఫర్ జీసస్ కార్యక్రమం ప్రారంభం



రన్ ఫర్ జీసస్ కరపత్రాలు విడుదల చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: రన్‌ఫర్ జీసస్ పేరుతో ఈనెల 8వతేదీ శనివారం పట్టణంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆరాధన టీవీ, రన్‌ఫర్ జీసస్ కో–ఆర్డినేటర్ టి.సంజయ్‌కిషన్ చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ మంగళవారం కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలు ఆమె కార్యాలయంలో విడుదలచేశారు. సంజయ్‌కిషన్ మాట్లాడుతూ మధ్యాహ్నం 3గంటలకు థామస్ బ్రిడ్జి వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పారు. కమిటీ ప్రతినిధులు సికిలే పెర్సిపాల్, చదలవాడ జ్ఞానప్రకాష్, ఏడీవీ ప్రసాద్, దాసిరి దేవరాజు, కేఎస్ ప్రకాష్, చదలవాడ జ్ఞానప్రకాష్, దాసరి దేవరాజు, గంటా జాన్‌కుమార్, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు కావలి నాని, అడిదల శరత్, బర్రి జయరాజు పాల్గొన్నారు.

# కాలుష్యానికి అధికారుల నిర్లక్ష్యమే కారణం



డంపింగ్ యార్డులో మంటను అదుపుచేస్తున్న ఫైర్ సిబ్బందికి సహకరిస్తున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని రెండు డంపింగ్ యార్డు నుంచి ప్రతిరోజు పొగ వస్తుండడంవల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. మంగళవారం స్థానిక 12వ వార్డులో ఉన్న డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ నిత్యం దారుణంగా పొగ వస్తుండడంతో 10, 11, 12, 15 వార్డులకు చెందిన ప్రజలు తీవ్ర అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. దీనికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై మునిసిపల్ అధికారులు ఆలోచించాచాలన్నారు. దీనిపై ఫోన్ ద్వారా కలెక్టర్, సబ్ కలెక్టర్లకు వివరించామన్నారు. డంపింగ్ యార్డులో ప్లాస్టిక్, మెడికల్ రసాయనాలకు చెందిన అనేక పరికరాలుంటాయని వాటిని దగ్ధం చేయడం ద్వారా వచ్చే పొగను పీల్చడంవల్ల ప్రజలు తీవ్రమైన అనారోగ్యాలకు గురయ్యే ప్రమాదం ఉందని వివరించారు. ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. వైసీపీ నాయకులు చెన్ను విజయ్, పెచ్చెట్టి కృష్ణాజీ, గంటా నరేష్, పిల్లా శ్రీను, త్సవటపల్లి కృష్ణమోహన్, కొండా గణేష్ పాల్గొన్నారు.

### రామాంజనేయులు కుటుంబానికి పరామర్శ

పోడూరు: మట్టపర్రు గ్రామంలో ఇటీవల ప్రమాదవశాత్తూ మృతి చెందిన బుద్ధిరెడ్డి రామాంజనేయులు(48) కుటుంబాన్ని మంగళవారం వైస్ ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, సర్పంచ్ దొమ్మేటి శ్రీనివాస్ పరామర్శించారు. యజమాని, డ్రైవర్ అయిన రామాంజనేయులు ఈ నెల 29న తన టిప్పర్‌కు మరమ్మతు చేపట్టాడు. ఆ సమయంలో ఒక్కసారిగా టిప్పర్ అతనిపై పడింది. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. రామాంజనేయులు ప్రమాదవశాత్తు మృతి చెందడం ఎంతో బాధాకరమని, అతని కుటుంబాన్ని ప్రభుత్వ పరంగా ఆదుకునేలా కృషి చేస్తామని వైస్ ఎంపీపీ, సర్పంచ్ హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు కొల్లాబత్తుల రవికుమార్, ఉప సర్పంచ్ విద్యంశెట్టి సత్యనారాయణ, పలువురు గ్రామ నాయకులు రామాంజనేయులు కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

# టీడీపీ నాయకుల మాయ మాటలు నమ్మొద్దు



వైఎస్సార్ ఆసరా చెక్కు అందిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుగొండ: చంద్రబాబు, టీడీపీ నాయకుల మభ్యపెట్టే మాయ మాటలు నమ్మి మోసపోతే రాష్ట్రంలో గతంలో మాదిరిగానే జన్మభూమి కమిటీల్లోని నాలుగైదు పందికొక్కులు గ్రామంలోని సంక్షేమ పథకాల సొమ్మును తినేస్తాయని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు విమర్శించారు. మంగళవారం ఆచంట మండలం, ఆచంట, ఆచంట వేమవరంల్లో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా చెక్కు పంపిణీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆచంట మండలంలో 1,252 గ్రూపులకు వైఎస్సార్ ఆసరా సొమ్ము రూ.48,75,43,960 జమ చేయాల్సి ఉండగా, మూడు విడతల్లో ఇప్పటి వరకూ రూ.36,56,57,990 జమ చేశారు. రాష్ట్రంలో ప్రతి పేద కుటుంబానికి వారి కష్టాల్లో అండగా నిలిచి ఆదుకున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. చంద్రబాబు, టీడీపీ నాయకులు నిన్నటి వరకూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల రాష్ట్రం నాశనమైపోతుందని, శ్రీలంక, పాకిస్థాన్‌లా మారిపోయిందంటూ గొంతెత్తి విమర్శలు చేసి, నేడు మాట మార్చి ప్రస్తుత పథకాలన్నీ అమలు చేస్తామంటూ సన్నాయి నొక్కులు నొక్కుతున్నారన్నారు. సీఎం జగన్ పాలనలో ఎక్కడా పైసా అవినీతి లేకుండా లబ్ధిదారులకే సంక్షేమ లబ్ధి అందిందన్నారు. సీఎం జగన్‌కు అండగా నిలిచి విజయాన్ని అందించాలని కోరారు. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, సర్పంచ్‌లు కోట సరోజనీ వెంకటేశ్వరరావు, జక్కంశెట్టి చంటి, బోడపాటి బుల్లియ్య, గణేషుల శేషువేణి, వీవర్స్ కార్పొరేషన్ డైరక్టరు అందే నాగ బసవన్న పార్టీ, ఎంపీటీసీ కర్రి అనురాధ, నాయకులుపిల్లి నాగన్న, మొల్లేటి రామకృష్ణ, గుడాల శ్రీను,స లాది రంగారావు పాల్గొన్నారు.

**శివాలయం అభివృద్ధికి కృషి**

పెనుగొండ: పెనుగొండ లింగాల వీధిలోని శివాలయం అభివృద్ధికి కృషి చేస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మంగళవారం తూర్పుపాలెంలో అభివృద్ధి కమిటీ సభ్యులతో ఆయన చర్చించారు. పూర్తిస్థాయి ప్రతిపాదనలు, అంచనాలు రూపొందించాలన్నారు. సమావేశంలో ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు (పెద్ద), కమిటీ సభ్యులు తమనంపూడి రాంబాబు రెడ్డి, తమనంపూడి అబ్బులు రెడ్డి, నూలి పవన్, గిరి రెడ్డి, టి సత్యనారాయణరెడ్డి, రామారెడ్డి పాల్గొన్నారు.

# ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు లేకుండా చర్యలు



పోడూరు మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు

పోడూరు: ప్రస్తుత దాళ్వా సీజన్‌లో ధాన్యం విక్రయాల్లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం పటిష్టంగా ఏర్పాట్లు చేసినట్లు జెడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్ అధ్యక్షత నిర్వహించారు. సమావేశంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకే సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా కేంద్రాల ద్వారా ధాన్యం విక్రయాలు జరిపేలా చర్యలు తీసుకున్నారన్నారు. కొమ్ముచిక్కాల జగనన్న కాలనీలో చాలామంది ఇప్పటికే ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారని, ఆ కాలనీలో తాగునీటి సదుపాయం కల్పించేందుకు ఆర్డబ్ల్యూఎస్ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని చెరువులను పూర్తిస్థాయిలో నింపేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పథకాల అమలు తీరును వివరించారు. ఈ సమావేశంలో వైస్‌ఎంపీపీ గుబ్బల సత్యనారాయణ, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ పెదపాటి పెద్దిరాజు, తహసీల్దార్ ఆర్‌వి కృష్ణారావు, ఎంపీడీఓ ఎం.బలరామరాజు, సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షురాలు గుబ్బల ఉషారాణి బ్రహ్మం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# విద్య ద్వారా అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలి

- రాష్ట్ర శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు
- కవిటంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ



కవిటం లాకుల వద్ద డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పోడూరు: ప్రతిపేద కుటుంబం విద్య ద్వారా అంబేడ్కర్ ఆశయాలను నెరవేర్చాలని రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు పిలుపునిచ్చారు. కవిటం లాకుల వద్ద మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మోషేన్‌రాజు ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రతి కుటుంబం విద్యావంతులు కావడం వల్ల ఆ కుటుంబానికే కాకుండా సమాజానికి, దేశానికి ఎంతో ప్రయోజనం ఉంటుందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, అబ్దుల్‌కలాం వంటి మహనీయులే ఇందుకు ఉదహరణన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలో సీఎం వైఎస్.జగన్ మోహన్‌రెడ్డి మహిళలు, దళితులు, పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన అందిస్తున్నారన్నారు. సభలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, స్థానిక ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటి యువత ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా మంచి భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఆచంటలో దాదాపు 2 ఎకరాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు శాసనమండలి చైర్మన్ మోషేన్‌రాజు, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున సహకారంతో కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీఫ్లోర్ లీడర్ గుంటూరి పెద్దిరాజు, ఎంపీపీ సబ్బితి సుమంగళి సాగర్, ఏఎంసీ ఛైర్మన్ చిల్లే లావణ్య, ఏపీ సీడ్ డెవలప్‌మెంట్, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు పోతుమూడి రామచంద్రరావు, పెదపాటి పెద్దిరాజు, సర్పంచ్ చుట్టుగుళ్ల పూర్ణిమ, సొసైటీ ఛైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, గ్రామకమిటీ అధ్యక్షుడు అంబళ్ల భాస్కరరావు, ఎంపీటీసీ కుక్కల సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యుడు సత్తి మురళీకృష్ణారెడ్డి, ఏఎంసీ వైస్‌ఛైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, మాజీ ఛైర్మన్ పడాల సత్యనారాయణరెడ్డి, ఉపసర్పంచ్ పోతంశెట్టి సూర్యనారాయణరెడ్డి, మాలమహానాడు గౌరవాధ్యక్షుడు బుడితి భీమారావు, కార్యదర్శి గొట్టుముక్కల ఏసురత్నం, అంబేడ్కర్ గ్రామకమిటీ, యువజన కమిటీ అధ్యక్షుడు కొంబత్తుల కళ్యాణ్‌కుమార్, వి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.